TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక : 23 | బుధవారం, మే 1, 2024 | కంప్లమెంటరీ కాపీ | పేజీలు : 4



తెలంగాణ టెన్త్ ఫలితాలు

## నిర్మల్ ఫస్ట్.. వికారాబాద్ లాస్ట్

హైదరాబాద్,ఏప్రిల్,30:
తెలంగాణ పదో తరగతి ఫలితాల ను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం విడుదల చేశారు. ఫలితాల్లో 91.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 5,05,813 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. 93.23 శాతం బాలికలు, 89.42 శాతం బాలురు పాసయ్యారు. 99.05 శాతంతో నిర్మల్ జిల్లా మొదటి స్థానంలో..65.10 శాతంతో వికారాబాద్ చివరి స్థానంలో నిలిచాయి. రాష్ట్రంలో 3,927 పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు బుర్రా వెంకటేశం తెలిపారు.

8,883 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించినట్లు చెప్పారు. జూన్ 3 నుంచి 14 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెంకటేశం తెలిపారు.
ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు నేటి నుంచి
15 రోజుల పాటు అవకాశం కల్పిస్తున్నా మని.. మే 16 లోపు ప్రధానోపాధ్యాయుల వద్ద ఫీజు చెల్లించవచ్చన్నారు. రీకౌంటింగ్‌కు రూ.500, రీవెరిఫికేషన్‌కు రూ.1000 చెల్లించాలని వివరిం చారు. ఫలితాల పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఒత్తిడికి గురికావొద్దన్నారు.

కర్నాటకకు ఖాళీ చెంబు, ఏపీకి మట్టి...

# తెలంగాణకు గాడిద గుడ్డు..

### మోడీపై రేవంత్ మాస్ సైటెర్స్...!



జమ్మికుంట,ఏప్రిల్,30:
పదేళ్లలో తెలంగాణకు ప్రధాని మోడీ ఇచ్చిందేమి లేదని.. కేంద్రంలో పదేళ్లు అధికారంలో ఉండి తెలంగాణకు ఆయన ఇచ్చింది గాడిద గుడ్డు అని ఎద్దేవా చేశారు. మోడీ కర్నాటకకు ఖాళీ చెంబు, ఏపీకి మట్టి, తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చారని సెటైర్ వేశారు. మాయ మాటలతో బీజేపీ తెలంగాణను వంచిస్తోందని ఫైర్ అయ్యారు. దేవుడి పేరుతో ఓట్లు అడుక్కునే దిక్కుమాలిన స్థితికిబీజేపీ వచ్చిందని విమర్శించారు. రాజకీయ అవసరాల కోసం బీజేపీ రాముడిని కూడా వదిలిపెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ మంగళవారం జమ్మికుంటలో జనజాతర పేరిట బహిరంగా సభ నిర్వహించింది. ఈ సభకు హాజరైన సీఎం రేవంత్ మాట్లాడుతూ.. మొన్న జరిగిన అసెంబ్లీ ఎలక్షన్స్ సెమీ ఫైనల్ అని.. సెమీస్‌లో కేసీఆర్‌ను చిత్తుచిత్తుగా ఓడించారు.. ఇప్పుడు ఫైనల్‌లో ప్రధాని మోడీని ఓడించాల్సిన బాధ్యత తెలంగాణ ప్రజలపై ఉందని అన్నారు.
కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ ఐదేళ్లలో కేంద్రం నుండి తెలంగాణకు తెచ్చిం దేమి లేదని విమర్శించారు. తెలంగాణను పార్లమెంట్‌లో ప్రధాని మోడీ అవమానించారని.. ఆ సమయంలో బండి సంజయ్ సభలోనే ఉన్నారని.. మోడీ రాష్ట్రాన్ని అవమానిస్తుంటే చూస్తూ కుర్చుకున్నారు తప్ప ఏమి అనలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ‘అసహనంతోనే ఫేక్ వీడియోలు’

### కాంగ్రెస్‌పై మండిపడ్డ అమిత్ షా



న్యూఢిల్లీ,ఏప్రిల్,30:
రిజర్వేషన్ల రద్దుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పినట్లు ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. తాజాగా అమిత్ షా దీనిపై స్పందిస్తూ.. కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఆ పార్టీ అసహనంతోనే ఫేక్ వీడియోలు తయారు చేస్తోందని మండిపడ్డారు. తమ మాటలు వక్రీకరించి దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇచ్చేందుకు భాజపా వ్యతిరేకమని మరోసారి స్పష్టం చేశారు. "400 సీట్లు దక్కించుకున్న తర్వాత భాజపా రిజర్వేషన్లను రద్దుచేస్తుందంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది. ఆ మాటలన్నీ నిరాధారమైనవి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లకు మా పార్టీ మద్దతు ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేస్తున్నాను.

## మే10 తర్వాత రాష్ట్రంలో పెను మార్పులు


### - కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్,ఏప్రిల్,30:
2024 పార్లమెంట్ ఎన్నికలకు సరిగ్గా 12 రోజులు వ్యవధి మాత్రమే ఉంది. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల వేడి రోజురోజుకు పెరిగిపోతోంది. ఇందులో భాగంగా ప్రధాన పార్టీలు ఒకరిపై మరొకరు తీవ్రమైన విమర్శలు చేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. మరోసారి భారీ మెజారిటీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అందుకు అనుగుణంగానే రాష్ట్రంలో ప్రచారం నిర్వహిస్తున్నారు.
దీనిపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఓ మీడియాతో మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో ప్రధాని మోడీ హవా కొనసాగుతుందని.. తాము చేసిన అభివృద్ధి పనులే తమను గెలిపిస్తాయన్నారు.
ఈ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ క్లీన్ స్వీప్ చేస్తుందని.. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తమపై విమ ర్శలు చేస్తున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. అలాగే నేటి నుంచి రాష్ట్రంతో ప్రధాని మోడీ వరుస సభలో పాల్గొంటారు.. కాసేపట్లో ఆయన తెలంగాణలో అడుగుపెట్టనున్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్..

### ఏడుగురు మావోయిస్టులు హతం



ఛత్తీస్‌గఢ్,ఏప్రిల్,30:
నారాయణ్‌పుర్ జిల్లాల సరిహద్దుల్లో మంగళవారం మావోయిస్టులు, భద్రతా సిబ్బంది మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్ లో ఏడుగురు నక్సల్స్ హతమయ్యారు. 15 రోజుల వ్యవధిలో ఈ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరగడం ఇది రెండోసారి. మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలోని తెక్‌మేట అటవీ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు నక్కినట్లు పోలీసులకు నిఘావర్గాల నుంచి సమాచా రం అందింది. దీంతో స్పెషల్ టాస్క్ ఫోర్స్, డీఆర్‌జీ దళాలు సం యుక్తంగా యాంటీ నక్సల్ ఆపరేషన్ చేపట్టాయి. గాలింపు చేపట్టి.. మంగళవారం ఉదయంనక్సల్స్ ఉన్న ప్రాంతాని కిచేరుకున్నాయి. వీరిని చూసిన మావోయి స్టులు కాల్పులు జరిపారు. దీంతో ఎదురు కాల్పులు జరిపిన భద్రతా దళాలు ఏడుగుర్ని మట్టుబెట్టాయి. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. మరికొందరు నక్సల్స్ పరారయ్యారు. ఈకాల్పుల్లో భద్రతా సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు. ఘటనాస్థలం నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

## 400 సీట్లు సాధిస్తాం: రాజ్‌నాథ్



న్యూఢిల్లీ,ఏప్రిల్,30:
లోక్‌సభ ఎన్నికల్లో 400కు పైగా సీట్ల లక్ష్యాన్ని భారతీయ జనతా పార్టీ సాధించి తీరుతుందని, కేంద్రంలో మూడోసారి తమ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని దేశప్రజల స్థిర నిశ్చయంతో ఉన్నారని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారంనాడు ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ పొత్తు ఎలాంటి ప్రభావం చూపించదని, కేంద్రప్రభుత్వ పథకాల ద్వారా యూపీ ప్రజలు లబ్ధి పొందుతున్నారని రాజ్‌నాథ్ చెప్పారు.
కుల, మత ప్రసక్తి లేకుండా ఎలాంటి వివక్షకు తావులేని విధంగా తాము పనిచేస్తున్నామని, ప్రజలు కూడా దీనిని అర్థం చేసుకున్నారని అన్నారు. విపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో కూడా ఎలాంటి పస లేదని, తాము అమేథీ, రాయబరేలిలో కూడా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. దక్షిణాది లోనూ బీజేపీ మంచి ఫలి తాలను సాధిస్తుందని రాజ్‌నాథ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రధానమ ంత్రి పాపులారిటీకి తిరుగులేదని, దక్షిణాదిలోనూ బీజేపీ సీట్లు కచ్చితంగా పెరుగుతాయని చెప్పారు. కేరళ, కర్ణాటక, తమిళ నాడు, తెలంగాణలో తాను పర్యటించానని, ఆయా చోట్ల వాతావరణం బీజేపీ కి అనుకూలంగా ఉందని తెలిపారు.



### ‘ఇప్పటికి నిద్ర లేచారు..

పతంజలి ఉత్పత్తుల లైసెన్సు రద్దుపై సుప్రీం

న్యూఢిల్లీ,ఏప్రిల్,30:
తప్పుదోవ పట్టించే పతంజలి ప్రకటనల కేసులో సుప్రీంకోర్టు మంగళ వారం మరోసారి విచారణ జరిపిం ది. ఈసందర్భంగా ఉత్తరాఖండ్ రాష్ట్ర లైసెన్సింగ్ అథారిటీ తీరుపై సర్వోన్నత న్యాయస్థానం అసహనం వ్యక్తంచేసింది. సుప్రీం తీర్పు వచ్చిన తర్వాతే పతంజలిపై చర్యలు తీసుకోవడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది.

# తస్మాత్ జాగ్రత్త

### రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్న బీజేపీ..: మంత్రి పొన్నం

అక్కన్నపేట, ఏప్రిల్ 30 :
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తుందని రాష్ట్ర రవాణా అండ్ బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు మద్దతుగా భారీ ర్యాలీ అనంతరం కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రెండు పర్యాయాలు కేంద్రంలో పాలన సాగించిన బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో కులం పేరుతో ప్రజలను విభజించి రాజ్యాంగానికి తూట్లు పొడిచే దుశ్చర్యకు పాల్పడుతుందని ఆరోపించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేసే అభివృద్ధి కార్యక్రమాలు చేయాల్సిన బిజెపి సర్కార్ మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతుందని మండిపడ్డారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావును భారీ మెజార్టీతో గెలిపించి కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో అధికారంలో తీసుకురావాలని పిలుపునిచ్చారు. మచ్చలేని స్వార్థపరుడైన వెలిశాల రాజేందర్రావును పార్లమెంటుకు పంపాలని కోరారు.



## ‘నాకే ఇంకా రైతు బంధు రాలేదు’

### మంత్రి తుమ్మల వీడియోపై కేసీఆర్ రియాక్ట్



హైదరాబాద్,ఏప్రిల్,30: రైతుబంధు ఇవ్వకుండా తెలంగాణ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ద్రోహం చేసిందని మాజీ ముఖ్య మంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ధ్వజమెత్తారు. తనకు ఇంకా రైతు బంధు రాలేదంటూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను ట్విట్టర్ లో షేర్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై విమర్శలు చేశారు. ఇవాళ ఖమ్మంలో జరిగిన కాంగ్రెస్ నేతల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడారు. ఈ సందర్భంగాతన పక్కనే కూర్చుని ఉన్న ఆర్థిక శాఖ మంత్రి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను చూపిస్తూ నాకే ఇంకా కొంత రైతు బంధు రాలేదని.. ఈ విషయాన్ని భట్టి విక్రమార్కను అడిగితే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చాక ఇస్తా అన్నాడని చెప్పారు.

# జమ్మికుంటలో జన"జాతర"

- విజయవంతమైన కాంగ్రెస్ జన గర్జన సభ
- జిల్లా నలుమూలల నుండి భారీగా హాజరైన కాంగ్రెస్ శ్రేణులు
- రాజేందర్ కు లక్షకు పైగా మెజార్టీ ఇస్తామని గంటాపదంగా ప్రకటన
- గుండు, అరగుండులను చిత్తు చేయాలని రేవంత్ రెడ్డి పిలుపు
- ప్రసంగంతో పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్ నింపిన సీఎం
- నేటి నుండి రెట్టింపు ఉత్సాహంతో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం








**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి కరీంనగర్:** కాంగ్రెస్ జనగర్జన సభతో జమ్మికుంట పట్టణంతో జనజాతరను తలపించింది, జమ్మికుంటతో పాటు యావత్ కరీంనగర్ జిల్లా దద్దరిల్లింది. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు విజయాన్ని కాంక్షిస్తూ కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హుజురాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట పట్టణంలో జనగర్జన సభను నిర్వహించింది. ఈ సభకు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుండి వేలాది మంది కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, వెలిచాల అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలుమార్లు విద్యావంతుడైన రాజేంద్ర రావుకు లక్ష మెజార్టీ ఇస్తారా అంటూ రేవంత్ రెడ్డి అడిగినప్పుడల్లా లక్షకు పైగానే ఇస్తామంటూ పార్టీ శ్రేణులు సభా ప్రాంగణం దద్దరిల్లేలా ప్రకటన చేశారు. అరగుండు బండి సంజయ్.. గుండు అరవింద్ లు తెలంగాణలో నియంత ఎంపీలు అని రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలతో పాటు తెలంగాణలో కారు గ్యారేజ్ కి పోయిందని, బీఆర్ఎస్ ను పార్టులుగా విడదీసి పాత ఇనుముకు వేయాల్సిందేనంటూ చేసిన వ్యాఖ్యలతో పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్ నిండింది. గత ఐదేళ్లుగా ఎంపీగా ఉన్న బండి సంజయ్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు శూన్యమై తేటతెల్లం కావడంతోపాటు, ఆయన కరీంనగర్ ప్రజలకు చేసిన మోసంపైనా కాంగ్రెస్ శ్రేణులు గుర్రుగా ఉన్నాయి. 24 గంటలు రామ జపం చేస్తూ రాక్షస పాలన కొనసాగిస్తున్నారంటూ రేవంత్ చేసిన ప్రసంగం పట్ల ప్రజల్లో ఆలోచన మొదలైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ, కొండగట్టు ఆలయాలకి ప్రసాద్ స్కీం ద్వారా నిధులు తేలేని బండి సంజయ్ దేవుడ్ని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్న తీరును ప్రజల్లోకి తీసుకెళ్లి, బండి వైఫల్యాలను ప్రజలకు వివరించడం ద్వారా కాంగ్రెస్ కు లాభం చేకూర్చవచ్చు అనే ఆలోచన కాంగ్రెస్ శ్రేణులకు వచ్చింది. ఎట్టి పరిస్థితుల్లో బీ ఆర్ ఎస్, బిజెపిలను చిత్తుచిత్తుగా ఓడించి కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకునేందుకు కాంగ్రెస్ శ్రేణులు కంకణం కట్టుకున్నారు. ముఖ్యంగా దివంగత జగపతిరావు రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒక దఫా ఎమ్మెల్సీగా కరీంనగర్ కు చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన తనయుడు రాజేందర్ రావును ఎంపీగా గెలిపించుకోవాలని ఉ వ్వితలుగుతున్నారు.



**పదేళ్ల పాలనలో బిజెపి ప్రజల నడ్డి విరిచింది : వెలిచాల**

గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పాలనలో ప్రజలు గోసపడ్డారని, అన్ని వస్తువుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచిందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు విమర్శించారు. హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని జమ్మికుంట మండల కేంద్రంలో జరిగిన జనగర్జన సభలో రాజేందర్ రావు మాట్లాడుతూ 2014లో 60 రూపాయలు ఉన్న పెట్రోల్ ధరలు నేడు 105 రూపాయలకు చేరాయని, 12 శాతం ఉన్న జీఎస్టీని 18 శాతానికి పెంచడంతో నిత్యవసర వస్తువుల ధరల పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తాను అన్న మోడీ కనీసం 20000 ఉద్యోగాలు కూడా ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. రాముడు పేరు చెప్పుకుంటూ రాక్షసుడు పాలన కొనసాగిస్తున్న బిజెపిని మే 15 జరగబోయే ఎన్నికల్లో పాతాళానికి తొక్కేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జగపతిరావు తనయుడుగా మీ ముందుకు వస్తున్న తనను ఒక్కసారి ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని కోరారు.

# పనిచేసినోడు పక్కకేనా దొర...

- విద్యార్థి యువతను పట్టించుకోని వెలిచాల!
- పార్లమెంట్ పరిధిలోని యువ నాయకులను పట్యించుకునే నాధుడే కరువా!
- సీఎం మీటింగ్ కి పిలిచే నాధుడే కరువు!
- వెలిచాల నిర్లక్ష్యం సంజయ్‌కి అనుకూలం!








**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి కరీంనగర్:**

పార్టీ కష్ట కాలంలో ఉన్న సమయంలో పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న నాయకులు, కార్యకర్తలను పక్కకు పెట్టడం వారికి కనిస సమాచారం ఇవ్వకపోవడం ఇన్ని దినాలు పనిచేసిన కార్యకర్తలను పక్కకు పెట్టడం ద్వారా వెలిచాల మీద కార్యకర్తల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల్లో కొన్ని సంవస్సరాల నుండి పార్టీ కష్ట కాలంలో ఉన్న సమయంలో పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలను కనీసం పట్టించుకునే నాధుడే కరువయ్యాడని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కార్యకర్తలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 10 సంవత్సరాలు ఆర్థిక ఇబ్బందులను తట్టుకొని గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎదురించి పార్టీని అధికారం లోకి తీసుకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం , యువజన విభాగం , ద్వితీయ శ్రేణి నాయకులు పరిస్థితి మరీ దారుణంగా తయారయ్యింది. మంగళవారం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజిక వర్గం జమ్మికుంట లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి జన జాతర సభ జరిగింది. ఈ సమావేశనికి పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు , విద్యార్థి యువత ముఖ్య నాయకులకు కనీస సమాచారం లేదనీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం పనిచేసిన వాళ్లకి టికెట్ ఇస్తే కింది స్థాయి నాయకుల కష్టాలు తెలుస్తాయని




వలసదారులకు టికెట్ ఇస్తే పార్టీకోసం కష్ట పడేనాయకుల విలువ ఏమీ తెలుస్తదని ఆవేదన వ్యక్తం చేస్తున్నరు.

**పార్టీ కోసం కష్టపడే నాయకులకు పట్టింపేది**

పార్టీకోసం అహర్నిశలు కృషి చేసే నాయకులకు ప్రచారానికి కనీస సమాచారం ఉండటం లేదనీ అవేదన వ్యక్తం చేస్తున్నారు. పది సంవస్సరాల నుండి అప్పులు చేసి రోడ్డు మీద కాంగ్రెస్ జెండా మోసిన నాయకులకు కనీసం ప్రచారానికి వాహనాలు, తిండి ఏర్పాటు చేసే నాధుడు లేదని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంటే సరే కానీ ప్రస్తుతం అధికారంలో ఉండి కూడా ఇలా చేయడం దారుణమని ద్వితీయ శ్రేణి నాయకుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి గతంలో ఉన్న అప్పటి నియోజిక వర్గ ఇంచార్జ్ లు 2023 ఎమ్మెల్యే ఎన్నికల్లో అందరినీ కలుపుకొని వెళ్లి కష్ట పడ్డా ప్రతి నియోజికవర్గం లో పార్టీ విజయఢంకా మోగించింది. కనీసం ఎమ్మెల్యే ఎన్నికల్లో చేసిన ప్రచారం తో పోలిస్తే 20 శాతం కూడా ప్రచారం చేయడం లేదు ప్రతి కార్యకర్త అభ్యర్థి ప్రవర్తన పై వ్యతిరేకంగానే ఉన్నారు. ప్రచారానికి రావాలి అనే పిలుపు లేదు. అభ్యర్థికి ఇక్కడ పార్టీ నాయకులు , కింది స్థాయి కార్యకర్తలు తెలియరు. తన స్వంత టీమ్ తో ముందుకు సాగి పోవాలి అని తన స్వంత మనుషులను పెట్టుకోవడం వల్ల వారికి నచ్చిన వారిని తప్ప పార్టీ కార్యకర్తలను పార్టీకోసం కష్ట పడ్డవారికి గుర్తింపు ఉండటం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**స్వంత పార్టీ లోనే అభ్యర్థి పై వ్యతిరేఖత**

వెలిచాల రాజేందర్ రావ్ కు ఆదినుండి అడ్డంకులే ఎదురవుతున్నాయి. పార్టీ కోసం పనిచేసిన వారికి కాదని కొత్త వ్యక్తికి టికెట్ ఇవ్వొద్దని నాయకులు కార్యకర్తలు ఎంత వ్యతిరేకించినా వెలిచాలకే టికెట్ కేటాయించడం ఇందుకు కారణం. గత ఎన్నికల్లో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ లో పార్టీ గెలిసేదని ఉన్న నాయకులను కాదనీ వలస దార్లకు టికెట్ ఇవ్వడం పట్ల వ్యతిరేఖత వచ్చింది. టికెట్ వచ్చాక అభ్యర్థి కనీసం పోలింగ్ బూత్ ఎజెంట్ లను సైతం ఎర్పాటు చేసుకోక మూడో స్థానంలో నిలిచాడు. ప్రస్తుతం వెలిచాల కు కూడా అన్ని అడ్డంకులే కొట్లడి తెచ్చుకున్న టికెట్ వృధా అవుతుందని పోల్ మేనేజ్మెంట్ సరిగా లేదని ఓటరు వరకు ఎవరు అభ్యర్థి అనేది చేరడం లేదు. మా తండ్రి, మా తాత, అని చెప్తే ఓట్లు పడే రోజులు కాదని మీరు ఏమీ చేస్తారో ప్రజలకు చెప్పాలి తప్ప వారసత్వంతో ఓట్లు పడేరోజులు కాదని రాజకీయ విశ్లేషకులు చెపుతున్నారు. ఇలా అయితే మా పార్టీ మూడో స్థానకినే పరిమితం కావాల్సి వస్తుందని కార్యకర్తలు అవేదన వ్యక్తం చేస్తున్నారు.




**కాంగ్రెస్ , బిఆర్ఎస్ పార్టీల నిర్లక్షం సంజయ్ కి ప్లస్ అవుతుందా?**

బి.ఆర్.ఎస్ , కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల నిర్లక్ష్యమే బిజెపి అభ్యర్థి కి ప్లస్ పాయింట్ అవుతుందా అంటే అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు గాడిలా వారసుడు కావాలా గరిబొల్ల బిడ్డ కావాల అని బండి సంజయ్ స్లోగన్ కింది స్థాయి ఓటరు దాకా పోయింది. బీజేపీ అభ్యర్థి ద్వితీయ శ్రేణి నాయకులను , యువతకి కష్ట కాలంలో సహాయం చేయడం అందరినీ ఆప్యాయంగా పలకరించడం ఆయనకు కలిసొచ్చే అంశం. ప్రతి పార్టీలో సీనియర్ల అలకలు పెద్ద ప్రభావం చూపవు కానీ విద్యార్థి యువత పార్టీలకు ఆక్సిజన్ లాంటివారు. ప్రాణం పోతుంటే అక్షిజన్ ప్రాణం పోస్తే పార్టీ మునిగి పోయే దశలో ఉంటే వాళ్లు చేసే పోరాటాలతో పార్టీ ఉనికి కాపాడుతారు. బీజేపీ అభ్యర్థి సంజయ్ అది తెలుసుకొని పోతుంటే ఇతర పార్టీలు వారికి కనీస గౌరవం ఇవ్వడం లేదు.

## పదవి విరమణ పొందిన ఇద్దరు పోలీస్ అధికారులు

**- పోలీసు అధికారులకు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికిన కరీంనగర్ అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ**



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ కరీంనగర్ :** కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో సబ్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న మొహమ్మద్ ఆరిఫుద్దీన్ 42 సంవత్సరాలు, హెడ్ కానిస్టేబుల్ గా సారంగధర 35 సంవత్సరాలు సుదీర్ఘ కాలం పోలీసు శాఖకు సేవలందించి నేటితో పదవికాలం ముగియడంతో మంగళవారం పదవి విరమణ పొందారు. మంగళవారం కమీషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలు యందు ఈ కార్యకరం నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ అనివార్యమన్నారు. ఎన్నో సవాళ్లతో కూడుకుని వున్న పోలీస్ ఉద్యోగం సంపూర్ణంగా చేసి పదవి విరమణ పొందడమే గొప్ప విజయం అన్నారు.

విరమణ పొందుతున్న అధికారులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం పదవి విరమణ పొందుతున్న అధికారులకు డీసీపీ చేతుల మీదుగా పూలమాలవేసి శాలువాతో సత్కరించారు. వారికి జ్ఞాపికలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, రిజర్వు ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి (వెల్ఫేర్), ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సంపాదకీయం

బుధవారం, మే 1, 2024

### అమెరికా స్వప్నం ఇప్పుడు అంత సులువు కాదు!

'అవకాశాల పురిటిగడ్డ'గా పేరుగాంచిన అమెరికాలో ఇప్పటికీ అదే వాతావరణం ఉన్నదా? ఈ ప్రశ్నకు అంత సులువుగా సమాధానం చెప్పలేని పరిస్థితి నేడు ఆ దేశంలో నెలకొని ఉన్నది. అమెరికాకు తరలి వచ్చే భారతీయ యువత ఆ దేశ వాస్తవిక పరిస్థితులను పూర్తిగా అర్థం చేసుకున్నాకనే ఒక నిర్ణయం తీసుకోవటం మంచిది. ఇండియాలో ఇంజినీరింగ్ చదివే ప్రతి కుర్రాడికీ అమెరికాలో మంచి అవకాశం వస్తే వెళ్లి ఉద్యోగం చేయాలనే కోరిక ఉంటుంది. చదువుకునే రోజుల నుంచీ ఆ దిశగా ప్రయత్నాలు ఎక్కుపెడతారు. మామూలు పరిస్థితుల్లో అయితే ఇది మంచి స్వప్నమే. కానీ ఇప్పుడు అమెరికాలో ఐటీ కొలువు అనేది కష్టసాధ్యంగా మారింది. అమెరికాలో ఐటీ ఉద్యోగ వాతావరణాన్ని, పర్యవసానాల్ని దగ్గరి నుంచి గమనిస్తున్న వ్యక్తిగా ఔత్సాహిక ఇంజినీర్లకు చెప్పగలిగిన మాట ఒక్కటే హెచ్-1బీ వీసా వచ్చినంత మాత్రాన అమెరికా బయల్దేరేందుకు తొందరపడవద్దు! నేడు అమెరికాలో పనిచేస్తున్న వారే వేల సంఖ్యలో ఉద్యోగాలను కోల్పోతున్నారు. కొత్త వారికి ఉద్యోగాలు వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఐటీ మినహా తతిమ్మా రంగాలు బాగానే వృద్ధిలో ఉన్నాయి. భారతీయ యువతరానికి అత్యంత ఆకర్షణీయమైన ఐటీ రంగం మాత్రం కుదేలైపోయింది. కరోనా అనంతర వాతావరణంలో ఇంత తీవ్రంగా ఐటీ రంగం దెబ్బతిన్నది ఎన్నడూ లేదని నిపుణులు చెబుతున్నారు. దీని పర్యవసానాలు ఇబ్బందికరంగా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే హెచ్-1బీతో ఇక్కడకు వచ్చి, భారీ ప్యాకేజీలున్న ఉద్యోగాలు సంపాదించి, ఆ ధైర్యంతో లోనుతో సొంత ఇల్లు కల తీర్చుకున్న వాళ్లు ఇప్పుడు వాయిదాలు కట్టడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఐటీ ఉద్యోగ వాతావరణం ఊహించినట్టుగా లేకపోవడం వలన కొత్త దంపతుల మధ్య కలహాలు ముదురుతున్నాయి. హెచ్-1బీ ఉన్నది కదాని అమెరికాకు వచ్చేసే మధ్యతరగతి భారతీయ కుటుంబాలకు చెందిన యువతీ యువకులు ఇక్కడ ఉద్యోగాలు దొరక్క, ఇంటి నుంచి ఆర్థికంగా జరుగుబాటు అందక అనేక ఇతర పనుల్లోకి దిగుతున్నారు. హెచ్-1బీ వీసా ద్వారా వచ్చినవారు తమ ప్రాజెక్ట్ అయిపోయినట్లయితే 60 రోజులకు మించి అమెరికాలో ఉండడానికి అవకాశం ఉండదు. కానీ వివిధ కన్సెల్టెన్సీ కంపెనీల ద్వారా ఇక్కడ ఉద్యోగాలు దక్కించుకుంటున్న వారికి ఒక సౌకర్యం ఉంది. భారతదేశానికి ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు సంబంధించినంత వరకు ఎక్కువ కన్సల్టెన్సీ కంపెనీలు తెలుగువారివే. ఇది మన హెచ్-1బీ వీసాదారులకు కలిసి వస్తున్న అంశం. ఎలాగంటే ఒకవేళ వారికి ప్రాజెక్ట్ అయిపోయినప్పటికీ ఈ కంపెనీలు వారిని పేరోల్స్ నుంచి తొలగించకుండా ఇన్సూరెన్స్ కూడా కొనసాగిస్తున్నాయి. అందువల్ల వారు కొత్త ప్రాజెక్టు చూసుకోవడానికి వీలు కలుగుతోంది. ఇక్కడ గమనించాల్సిన సంగతి ఏంటంటే ఇటువంటి సందర్భాలలో అమెరికన్ యాజమాన్యంలో ఉన్న కన్సల్టెన్సీలకు సంబంధించినంత వరకు ప్రాజెక్టు అయిపోయిన తర్వాత వాళ్లు 60 రోజుల లోపు దేశాన్ని ఖచ్చితంగా విడిచి వెళ్లిపోవాలి. ఈ గడ్డు పరిస్థితిలో భారతీయ యువత స్వయం కృతాపరాథం కూడా కొంత ఉంది. కోవిడ్ సమయంలో అమెరికన్ కంపెనీలు పెద్దఎత్తున రిక్రూట్‌మెంట్ చేపట్టాయి. ఈ అవకాశాన్ని భారతీయ విద్యార్థులు అడ్డదారుల్లో కూడా వినియోగించుకున్నారు. నకిలీ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందినవారు కొల్లలుగా ఉన్నారు. విద్యార్హతలు, నైపుణ్యాలు, అనుభవం అన్నింటిలోనూ నకిలీ సర్టిఫికెట్లే. కానీ పనిలో చేరిన తర్వాత వారిలోని డొల్లతనం బయటపడింది. పనికి సరిపడిన జ్ఞానం, నైపుణ్యం వారి వద్ద లేకుండా పోయాయి. చివరకు భారతీయ విద్యార్థులు అంటేనే అనుమానంతో చూసే పరిస్థితి ఏర్పడింది. ఇది ఇప్పుడు కొత్తగా ఉద్యోగాలు ఆశిస్తున్న వారికి ఇబ్బందిగా పరిణమించింది. ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగు రాష్ట్రాల నుంచి అమెరికా రావాలనుకునే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఒకటికి పదిసార్లు ఆలోచించుకోవాలి. ఒకవేళ వారు పనిచేసే కంపెనీ స్పాన్సర్ చేసినట్లయితే వారికి ఎటువంటి ఇబ్బందులు ఉండకపోవచ్చు. అలాగాక సాధారణ కన్సల్టెన్సీల ద్వారా హెచ్-1బీ వీసాతో అమెరికాకు రావడం మంచి నిర్ణయం కాకపోవచ్చు. ముఖ్యంగా భారతదేశంలో ఇప్పటికే ఉద్యోగాలలో ఉన్నవారు కొందరు ఆ ఉద్యోగాలను వదిలేసి ఇక్కడకు వస్తున్నారు. ఇక్కడ ఉద్యోగాలు దొరక్క, దొరికిన ఉద్యోగాల్లో స్థిరత్వం లేక మానసిక ఒత్తిడికి లోనవటంతో పాటు, అనేక ఆర్థిక ఇబ్బందులు కూడా పడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారాలు పరిమితంగానే ఉన్నాయని చెప్పాలి. ముందుగా హెచ్-1బీ వీసాల మీద అమెరికా వస్తున్నవారికి వారి ఎంప్లాయర్ నుంచి పూర్తి మద్దతు ఉండాలి. ఈ క్లిష్ట సమయంలో ఎంప్లాయర్లు ఇతర కంపెనీలలోనైనా ఉద్యోగాలు చూసిపెట్టగలగాలి. ఏఐ వంటి సాంకేతికత నేపథ్యంలో చాలా ఉద్యోగాలు ప్రమాదంలో పడుతున్నాయి. సాంకేతికంగా వచ్చే ప్రతి మార్పునకు ఉద్యోగార్థులు అప్?డేట్ అవుతూ ఉండాలి. తమను తాము ఉత్తమ ప్రమాణాలతో ఎప్పటికప్పుడు నవీకరించుకుంటూ ఉంటే ఉద్యోగాలకు ప్రమాదం ఉండదు. అవకాశాలు పొందడం కూడా సులువు అవుతుంది.

# పది ఫలితాల్లో అల్ఫోర్స్ టాప్







- 135 జీపీఏ సంధించిన విద్యార్థులు
- విద్యార్థులను అభినందిచిన విద్యాసంస్థల అధినేత వి.ఎన్.ఆర్




అత్యుత్తమ భోధన ద్వారా అగ్రశేణిలో ఫలితాలను సాధించవచ్చని మరియు ఉజ్వల భవిష్యత్తుకు పునాదని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి. నరేందర్రెడ్డి అన్నారు. స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ ట్రైనిటాట్స్ ప్రాంగణంలో 10వ తరగతి ఫలితాలలో అల్ఫోర్స్ గ్రూఫ్ ఆఫ్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ 10 జి.పి.ఏ. లు సాధించడం పట్ల ఏర్పాటు చేసినటువంటి విజయోత్సవ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అల్ఫోర్స్ గ్రూఫ్ ఆఫ్ స్కూల్స్ కి చెందిన 135 మంది విద్యార్థులు 10 జి.పి.ఏ లను సాధించడం చాలా గొప్ప విషయమని తెలిపారు. తెలంగాణ రాష్టంలో అగ్రగామిగా కొనసాగటం చాలా స్ఫూర్తిదాయకమని , అత్యుత్తమ ఫలితాలకు అల్ఫోర్స్ నిర్వచనమని చెప్పారు. 139 మంది విద్యార్థులు 9.8 జి.పి.ఏ సాధించారని మరియు 113 మంది విద్యార్థులు 9.7 జి.పి.ఏ లను సాధించారని తెలిపారు. 1140 మంది విద్యార్థులకు గాను 747 మంది విద్యార్థులు 9 జి.పి.ఏ ఆపై మార్కులు సాధించడం విశేషం. ఇటీవల కాలంలో ప్రకటించిన ఇంటర్ మరియు ఐఐటీ-జెఇఇ (మెయిన్) ఫలితాల్లో తెలంగాణ రాష్ట్రస్థాయి ఉత్తమ మార్కులను మరియు వివిధ విభాగాల్లో ప్రశంసనీయ ఆల్ ఇండియా ర్యాంకులు సాధించారని చెప్పారు. అత్యధిక స్థాయిలో 10 జి.పి.ఏ లు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తు విజేతలందరికి పుష్ప గుచ్ఛాలను అందజేసి మరియు అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని అకాక్షించారు. విద్యార్థులకు ఎల్లప్పుడూ ప్రోత్సాహాన్ని అందిస్తున్న తల్లిదండ్రులకు మరియు విజయపరంపరను కొనసాగించడానికై అహర్నిశలు కృషిచేస్తున్న ఉపాధ్యాయులకు మరియు సిబ్బందికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గోన్నారు.

## బెజ్జంకి మండలంలో 99.49% పదవ తరగతి విద్యార్థులు పాస్




- 100% బాలురుపాస్
- రేగులపల్లిలోని పల్లోటి పాఠశాలలో ఏడుగురు
- గురుకుల పాఠశాలలో ముగ్గురు
- సత్యసాయి విద్యాలయంలో ఇద్దరు 10/10
- బాలురు 100% పాస్

**తెలంగాణ క్యాపిటల్ బెజ్జంకి:** మంగళవారం వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో బెజ్జంకి మండలంలోని 16 ప్రభుత్వ , ప్రైవేటు ఉన్నత పాఠశాలలో 396 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 394 మంది విద్యార్థులతో 99. 49% విద్యార్థులు అయ్యారు. రేగులపల్లి లోని సెయింట్ విన్సెంట్ పల్లోటి ఉన్నత పాఠశాలలో ఏడుగురు, బెజ్జంకిలోని శ్రీ సత్యసాయి గురుకుల విద్యానికేతన్ లో ముగ్గురు, బాలికల రెసిడెన్షియల్ స్కూల్ హుస్నాబాద్ (బెజ్జంకి కి చెందినది) లో ఇద్దరు విద్యార్థులు 10/10 జిపిఎ సాధించారు. 10వ తరగతి పరీక్షలకు 199 మంది బాలురు హాజరు కాగా 199 మంది, బాలికలు 197 విద్యార్థులకు గాను 195 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గురుకుల పాఠశాల హుస్నాబాద్ (బెజ్జంకి) మినహా అన్ని పాఠశాలలో 100% మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వలనే రైతు చనిపోయాడు

- మాజీ ఎమ్మెల్యే రవిశంకర్
- ఎక్స్ గ్రేషియ ఇచ్చి రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి





**తెలంగాణ క్యాపిటల్, చొప్పదండి:** చొప్పదండి మండలం రాగం పేట గ్రామానికి చెందిన రైతు ఐతరవేణి రాజేశం వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లను నేర్పడానికి వెళ్లి ఎండ దెబ్బతో హఠాన్మరణం పొందిన యువ రైతు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సంఘటన స్థలానికి చేరుకొని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి మరణానికి గల కారణాలను తెలుసుకొని జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడి మృతుని కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని కోరారు చేశారు.వరి ధాన్యం కొనుగోలు ఆలస్యం అవ్వడం వలన ధాన్యం పోసిన వద్ద రైతులు కాపు కాయడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని. లారీల కొరత లేకుండా చూసి కొనుగోళ్ళను వెంట వెంటనే ప్రారంభించాలని కోరడం జరిగింది.

## ఉపాధి హామీ కూలీల చెంతకు బీఆర్ఎస్ నేతలు





**తెలంగాణ క్యాపిటల్ బెజ్జంకి:** బెజ్జంకి మండలంలోని చిలాపూర్ గ్రామం లో ఉపాధి హామీ కూలీల చెంతకు బీఆర్ఎస్ పార్టీ నేతలు మంగళవారంవెళ్లి ప్రచార నిర్వహించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయిన్పల్లి వినోద్ కుమార్ ను గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పవ్వాడి మల్లికార్జున్, గ్రామ శాఖ బీఆర్ఎస్ అధ్యక్షులు పంతం శ్రీనివాస్, మండల శ్రీకాంత్, కొంకటి జగన్, లక్ష్మారెడ్డి, హరీష్, పవ్వాడి శేఖర్, బుగ్గయ్య, జేరిపోతుల లక్ష్మణ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

## తాగునీటి సమస్య రాకుండా చూడాలి

- పంచాయతీ అధికారులను ఆదేశించిన ఎంపీడీవో



**తెలంగాణ క్యాపిటల్, రామడుగు:** రామడుగు మండల కేంద్రంలో గత కొద్ది రోజుల నుండి తాగునీటి సమస్య తీవ్రమైనందున ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు రాగా మంగళవారం ఎంపీడీవో రాజేశ్వరి మండల కేంద్రంలోని కాలనీలో తిరుగుతూ త్రాగునీటి సమస్య ఎక్కడ ఉందో గుర్తించి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రేవంతన్నా... నా గుండుతో నీకేం పని?

- నేను చేసిన పోరాటాలు, కరీంనగర్ కు చేసిన అభివృద్ధి నీకు కన్పించడం లేదా?
- ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కు మిగిలేది గుండు సున్నాయే
- 6 గ్యారంటీల అమలు గాడిద గుడ్డు...గుండు సున్నా...
- దమ్ముంటే ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదో చెప్పాలి
- మీ లెక్క.. తెలంగాణ పేరెత్తితే తుపాకీతో కాలుస్తానని అనలే
- ఢిల్లీలో టియర్ గ్యాస్, వాటర్ క్యాన్ వదిలినా తెలంగాణ కోసం గర్జించిన
- జమ్మికుంటలో సీఎం సభ అట్టర్ ఫ్లాప్....
- ఆ ఆక్రోశంతోనే ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నడు..
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు గట్టి కౌంటర్ ఇచ్చిన బండి సంజయ్

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ కరీంనగర్ :** "రేవంతన్నా... నేను 6 గ్యారంటీల సంగతేమైందని అడిగితే... గుండు, అరగుండ అంటూ హేళనగా మాట్లాడతవా? 5 ఏళ్లలో నేను చేసిన పోరాటాలు, కరీంనగర్ అభివృద్ధికి తెచ్చిన నిధులు నీ కళ్లకు కన్పించడం లేదా?"అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. సీఎం హెూదాలో రేవంత్ రెడ్డి వాడుతున్న భాషను చూసి జనం అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. "మీరెన్ని డ్రామాలాడినా, ఎంతగా హేళన చేసినా రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ వచ్చే సీట్లు గుండు సున్నా"అని ఎద్దేవా చేశారు. కొద్దిసేపటి క్రితం సిరిసిల్ల పట్టణానికి విచ్చేసిన బండి సంజయ్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జమ్మికుంటలో ఈరోజు నిర్వహించిన సీఎం బహిరంగ సభ అట్టర్ ఫ్లాఫ్ అయ్యిందని, ప్రజలు కాంగ్రెస్ ను తిరస్కరిస్తున్నారనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో రేవంత్ సహా కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతూ అసభ్య పదజాలంతో తిడుతూ ప్రజల దృష్టిలో మరింత చులకన అవుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఏమన్నారంటే. జమ్మికుంటలో సీఎం రేవంత్ రెడ్డి అట్టర్ ఫ్లాప్. జనం లేక వెలవెలపోయింది. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఉన్న నిరాసక్తతకు, తిరస్కరణకు నిదర్శనమిది. జమ్మికుంట సభలో సీఎం చేసిన వ్యాఖ్యలు బాధ కలిగించాయి. ఆయన ఉపయోగిస్తున్న భాష జుగుప్సాకరం. సీఎం హెూదాలో ఉంటూ దిగజారి మాట్లాడటం సిగ్గు చేటు. మేధావి వర్గం, సామాన్య ప్రజలు సీఎం మాటలపై చర్చ జరుగుతోంది. సీఎంకు నా గుండుతో పనేంది? నాది అరగుండా? గుండా? అనేది నీకెందుకు? గాడిద గుడ్డు, అరగుండు, గుండు సున్నా అంటూ వ్యక్తిగతంగా కించపర్చడం సిగ్గు చేటు. తెలంగాణలో నేను చేసిన పోరాటాలు, కరీంనగర్ లో నేను చేసిన పోరాటాలు కన్పించడం లేదా? నా గుండు మాత్రమే నీకు కన్పిస్తుందా? నువ్వెంత హేళన చేసినా పట్టించుకోను. ఆరు గ్యారంటీల సంగతి చెప్పు. వంద రోజుల్లో మహిళల అకౌంట్లో ప్రతినెలా రూ.2500 లు ఇస్తానన్నవ్. ఏమిచ్చినవ్. గాడిద గుడ్డు, గుండు సున్నా. రైతు భరోసా కింద రైతులకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తానన్నవ్... ఏమిచ్చినవ్? గాడిద గుడ్డు, గుండు సున్నా తప్ప? వడ్లకు బోనస్ ఇస్తానన్నవ్? తులం బంగారం ఇస్తానన్నవ్? విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా ఇస్తానన్నవ్. వృద్ధులకు రూ.4 వేల పెన్షన్ ఇస్తానన్నవ్? ఏమిచ్చినవ్.. గాడిద గుడ్డు.. గుండు



సున్నా... ఎన్నికల్లో మీ పార్టీకి వచ్చేది గుండు సున్నా... మీకు దమ్ముంటే 6 గ్యారంటీలపై చర్చించు. వాటిని ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు వివరించు.. ఇప్పటికే హామీలను అమలు చేయకపోవడంతో జనం తిరగబడుతున్నా కాంగ్రెస్ నేతలకు బుద్ధి రావడం లేదు. కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో కూడా ప్రజలకు తెలియదు. ఆయన ఏం మాట్లాడుతున్నరో ఆయనకే అర్థం కావడం లేదు. మేం శ్రీరాముడి గురించి మాట్లాడుతుంటే.. దేవుడి పేరు చెప్పుకోవడం తప్ప బీజేపీ చేసిందేమీ లేదన్న రేవంత్ రెడ్డికి.. దేవుడి మీద ఓట్టేసి రుణమాఫీ చేస్తానంటున్నడు. చివరకు ఆయనకు దేవుడే దిక్కయ్యిండు.. మేం పక్కా రాముడి వారసులం. బరాబర్ మాట్లాడతాం. కాంగ్రెస్ ది ద్వంద్వ విధానం. మైనారిటీ డిక్లరేషన్ పేరుతో ఒక వర్గం ఓట్లు దండుకుంటున్నరు. మీ లెక్క తెలంగాణ ఉద్యమం చేస్తానంటే తుపాకీతో కాల్చేస్తానని నేను అనలే... ఢిల్లీలో టియర్ గ్యాస్, వాటర్ వదిలినా వెనుకంజ వేయకుండా జై తెలంగాణ అని గర్జించి గాండ్రించిన నాయకుడిని నేను. ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలినా తెలంగాణలో అత్యధిక స్థానాలు బీజేపీ గెలవడం తథ్యం. కరీంనగర్ లో భారీ మెజారిటీ ఖయాం.

# బీఆర్ఎస్‌కు బిగ్ షాక్

## - కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ లు తదితరులు





**తెలంగాణా క్యాపిటల్ బెజ్జంకి:** మండలంలో పలువురు బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచులు వివిధ కుల సంఘాల నేతలు వారి అనుచరులతో పెద్ద ఎత్తున మంగళవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానకొండూరు ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని బెజ్జంకి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దేవనపల్లి మంజుల, దేవన పెల్లి శ్రీనివాస్ , తిమ్మాయపల్లి మాజీ సర్పంచ్ కవ్వ లింగారెడ్డి, బెజ్జంకి క్రాసింగ్ మాజీ సర్పంచ్ రాజయ్య, మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు మచ్చ శేఖర్ మామిడి జయరాములు, బూర మధుసూదన్ ల ఆధ్వర్యంలో మండలంలోని పలువురు పద్మశాలీలు, ధండ్ల సురేష్ ఆధ్వర్యంలో వడ్డెర సంఘం నేతలు, ఆయన అనుచరులు , దోనే నర్సింగం, శ్యామ్ ల ఆధ్వర్యంలో ఆరె క్షత్రియ సంఘం నాయకులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరినారు. వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. బెజ్జంకి కాంగ్రెస్ లో వీరందరి చేరికతో బెజ్జంకి మండలంలో బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ గా చెప్పుకోవచ్చు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో అందరూ కలిసికట్టుగా పనిచేసి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచార రాజేంధర్ రావ్ ను గెలిపించాలని కోరారు. బిజెపి అభ్యర్థి బండి సంజయ్ చేసిన అభివృద్ధి ఏది లేదని, మాటలు మాత్రమే ఉన్నాయని విజ్ఞానవంతుడు అయినా వెలిచాల రాజేందర్ రావు ను గెలిపించుకోవాలని, రిజర్వేషన్లు తీసివేస్తానన్న బిజెపి పార్టీని ఎట్టి పరిస్థితుల్లో గెలిపించ వద్దన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్ కుమార్ రావ్ నాన్ లోకల్ వ్యక్తి అని వినోద్ రావ్ కార్యకర్తలకు అందుబాటులో ఉండడని ఆయనకు ఓటు వేస్తే చెత్తబుట్టలో వేసినట్టే అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లోకల్ అందరికీ అందుబాటులో ఉంటాడని రాజేందర్ రావ్ ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముకీస రత్నాకర్ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష ఉపాధ్యక్షులు ఒగ్గు దామోదర్ ,లింగాల శ్రీనివాస్, చెప్పాల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ అక్కరలేని పోచయ్య జేల్ల ప్రభాకర్, మానాల రవి, సోషల్ మీడియా ఇంచార్జ్ దోనె వెంకటేశ్వరరావు 100మంది కి పైగా కార్యకర్తలు పాల్గొన్నారు.



# ముగిసిన బెజ్జంకి లక్ష్మీనృసింహా స్వామి వారి బ్రహ్మోత్సవాలు

**తెలంగాణ క్యాపిటల్ బెజంకి:** పక్షం రోజులుగా సాగిన శ్రీ బెజ్జంకి లక్ష్మీనృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారం చక్రతీర్థంతో ముగిసినాయి. సాయంత్రం వేళ గుట్టపై గుడిలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఉత్సవ మూర్తుల విగ్రహాలను మేళ తాళాల మధ్య, సన్నాయి వాయిద్యాలతో, పలువురు భక్తుల గోవింద నామస్మరణలతో , గ్రామ పురవీధుల గుండా స్వామివారి ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఊరేగిస్తూ, బెజ్జంకి గ్రామంలోని ఆలయానికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి పీ వీ శర్మ, ఆలయ ప్రధాన పూజారి శేషం మధుసూదనాచార్యులు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించండి

## - వడ్లూర్ గ్రామంలో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్



**తెలంగాణ క్యాపిటల్ బెజ్జంకి:** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని వడ్లూర్ గ్రామంలో మంగళవారం ఉదయం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ నిర్వహించారు. సత్యనారాయణ ఈ సందర్భంగా పలు కాలనీలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుంటూ, కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజేందర్ రావ్ ను గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామంలోని సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని అంచలవారిగా అమలు అవుతాయని అన్నారు . తమ గ్రామానికి బస్సు సౌకర్యం లేదని పలువురు మహిళలు తెలుపగా ప్రస్తుతం బస్సుల కొరత ఉందని ఎన్నికల అనంతరం కొత్త బస్సులను ప్రభుత్వం కొనుగోలు చేయనుందని అప్పుడు తప్పకుండా బస్సు వస్తదని హామీని ఇచ్చారు . కాంగ్రెస్ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు . ఉపాధి హామీ కూలీరేట్లను సైతం త్వరలో ప్రభుత్వం పెంచనుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం లను కట్టించలేదని తాము గతంలో ఇందిరమ్మ ఇళ్లని ఇచ్చామని, ఎన్నికల అనంతరం కూడా ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరినారు. బండి సంజయ్ చేసిన అభివృద్ధి శూన్యమని రాముడి పేరుతో ప్రజలను తప్ప ఆయన చేసింది ఏమీ లేదని అన్నారు. బి ఆర్ ఎస్ భూకబ్జా దారుల పార్టీ అని కరీంనగర్లో వాళ్ళు చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కాదని రోజుకో కార్పొరేటర్ జైల్ కి పోతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి నాన్ లోకల్ అని ఆయన ఎవరిని పట్టించుకోడని అయినకు ఎవరు గుర్తుండరని , ఎన్నికలవగానే మనకు కనిపించడని ఆయన జోష్యం చెప్పారు . మార్నింగ్ వాక్ లో ఆయనతో పాటుగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రత్నాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, బెజ్జంకి మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ అక్కరవేణి పోచయ్య , నాయకులు పులి కృష్ణ, మహంకాళి ప్రవీణ్ ,పులి సంతోష్, రాసూరి మల్లికార్జున్ , గాదం స్వామి యాదవ్ తో పాట పలువురు గ్రామస్తులు ఉన్నారు.

# రామడుగులో రాజకీయం మారింది........?

- కాంగ్రెస్ లోకి సిటింగ్ బిఆర్ఎస్ ఎంపీటీసీలు
- రామడుగు బిఆర్ఎస్ కంచుకోటలు బద్దలు కొట్టిన కాంగ్రెస్
- కీలక నేత సైలెంట్ పై సర్వత్ర చర్చ..
- ఎంపీ ఎలక్షన్ వేళ బిఆర్ఎస్ పార్టీకి షాక్......!



**తెలంగాణ క్యాపిటల్, రామడుగు:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన విషయం అందరికీ తెలిసిందే. దీనికి తోడు రామడుగు మండలంలో 12 మంది ఎంపీటీసీలలో మెజారిటీ ఎంపీటీసీలు బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన వారే కావడంతో గ్రామాలలో ప్రజల వద్ద నుండి వస్తున్న వ్యతిరేకతతో కొంతమంది ఎంపీటీసీలు సోమవారం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అంతేకాకుండా కొంతమంది ఎంపీటీసీలు ప్రజలకు ప్రభుత్వ ఫలాలు చేకూర్చడం కోసం అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీలోకి వెళ్లి ప్రజలకు సేవ చేయడంలో తప్పులేదని బహిర్గతంగానే చెబుతున్నారు.

**- ఎంపీపీ పై అవిశ్వాసం రోజే ఆఫర్ కుదిరిందా.....?**

గత కొద్ది రోజులుగా తాజా మాజీ ఎంపీపీ కలిగేటి కవితపై మెజారిటీ ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం కోరగా మెజారిటీ ఎంపీటీసీలు అందరూ హైదరాబాదులో మకాం వేసి కాంగ్రెస్ ప్రభుత్వంతో పొత్తు కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. తదనంతరం ఎంపీటీసీలు అందరూ కలిసి కాంగ్రెస్ ఎంపీటీసీ జవ్వాది హరీష్ కు ఎంపీపీ పదవి పట్టం కట్టారు. నాటి నుండి నేటి వరకు ఎంపీటీసీ లందరూ టిఆర్ఎస్ మీటింగ్లలో కనిపించకపోవడం మండలంలో చర్చకు దారి తీసింది. అనంతరం సోమవారం నియోజకవర్గ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గంగాధర మండలంలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీటీసీలకు, సర్పంచ్ల ఫోరం అధ్యక్షునికి, సింగిల్ విండో చైర్మన్ కి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో బిఆర్ఎస్ పార్టీకి ఓటు బ్యాంకుపై ప్రభావం పడే అవకాశం ఎక్కువగా కనిపిస్తుంది.

**- సైలెంట్ మూడ్ లో కీలక నేత....?**

ఇది ఇలా ఉండగా కలిగేటి కవిత ఎంపీపీ కావడానికి రామడుగు మండలంలో వీర్ల వెంకటేశ్వరరావు గ్రౌండ్ వర్క్ వర్క్ చేసి కలిగేటి కవితకు పట్టం సంగతి అందరికీ తెలిసిందే. అనంతరం కవితపై అవిశ్వాస తీర్మానం నుండి నేటి వరకు ఆయన సైలెంట్ ఉండడం పట్ల బిఆర్ఎస్ ఎంపీటీసీలు పార్టీలో ఉండడానికి సుముకత చూపుతలేదని మండలంలో చర్చ సాగుతుంది.

ఇంతటి రాజకీయ పరిణామాలు రోజు రోజుకు మారుతున్న కీలక నేత పెదవి చెప్పకపోవడం పట్ల అంతర్యం ఏమిటో అంతు తిక్కకుండా ఉన్నది. రామడుగు మండలం బిఆర్ఎస్ పార్టీ కంచుకోటగా చెప్పుకు వచ్చిన నేత ఈరోజు సైలెంట్ ఉండడంతో ఎంపీటీసీలు అందరూ జట్టు కట్టి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. మరి దీనితో ఎంపీ ఎలక్షన్ల వేల రామడుగులో రాజకీయం రసవత్తరంగా మారిందని కనిపిస్తుంది.

# లక్ష్య సాధనకు కృషి చేయండి

## - ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలవండి




**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ కరీంనగర్:** రెండు మూడు సంవత్సరాల నుండి ఫెయిల్ అయి పరీక్షలు రాయని విద్యార్థులు ఈసారి పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడం చాలా సంతోషకరమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. మంచి లక్ష్యాన్ని ఎంచుకొని పట్టుదలతో శ్రమిస్తూ దాన్ని సాధించాలని సూచించారు. మంగళవారం సాయంత్రం 10వ తరగతిలో ఫెయిల్ అయి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అంజలి, జే లావణ్య, కొక్కు మణికంఠ సాయికిరణ్, ఎస్డి తన్వీర్, బుష్రా ఫాతిమా, కవ్వంపల్లి శివను కలెక్టర్ కార్యాలయం లో జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా వారికి డిక్షనరీలను బహుకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 95 మంది విద్యార్థుల్లో 72 మంది ఉత్తీర్ణత సాధించడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. ఇందుకోసం కష్టపడ్డ ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వచ్చే సప్లిమెంటరీ పరీక్షల్లో మిగతా విద్యార్థులు పాస్ అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పాస్ కాని వారు నిరాశ, నిస్పృహలకు లోను కాకుండా చూడాలని పేర్కొన్నారు. కష్టపడి చదువితే మంచి మార్కులు రావడం ఖాయమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీఈవో జనార్దన్ రావు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ నరసింహస్వామి, ఏఎం ఓ అశోక్ రెడ్డి, ప్రభాకర్ రావు, హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

